# మాడరన్ సివిలిజేషన్ X

రచన:
"సాగర శ్రీ"

'బాబూ! ఇంకో రెండణాలు ఇప్పించండి.'

'మాట్లాడకుండ వెళ్ళిపోరా! నే నెప్పుడూ ఇచ్చేది పావులా.'

'ఏంటి బాబూ అట్లా అంటారు. మార్కెటునుండి ద్వారకా నగర్‌కు ఎవడు బాబూ పావులాకు వచ్చేది.'

'ఎవడో ఒకడు. నే నింతకన్నా ఒక్క కానీ ఎక్కు వియ్యను. పోరా! పో! వెధవ గోల.'

'మీరాలా అంటే బీదా బిడ్డా బ్రతికేది ఎలాగండి. ఇంకొక్క రెండణాలు ఇప్పించండి. ఏదో మీదయతో.'

'నీక్కాదంటరా చెప్పేది. వెధవ గోల.'

'అవునండి బాబుగారూ! కష్టపడి డబ్బు లడిగితే వెధవ గోలగానే వుంటవి. నేనేం వూరికినే అడగలే దండి. కష్టపడ్డాను. ఇవ్వమంటున్నాను.'

'ఏంటిరా నీకష్టము. కష్టానికి తగినట్లుగానే ఇచ్చాను.'

'కష్టానికి తగ్గట్టు అంతా తగ్గట్టు. ఇంతకీ నాది బుద్ధి తక్కువలెండి. ముందు బేరము మాట్లాడకుండా ఎక్కించు కున్నాను. ఏదో పెద్దోళ్ళు గదా న్యాయంగా ఇస్తారని.'

'ఏంటిరా వెధవగోల నువ్వూను. పోతావా! పోవా! నేనొక్కనయాపైసాగూడ ఇచ్చేది లేదు.'

'పోతున్నానండి పోతున్నా. కష్టపడినవానికి ఇవ్వ టానికి గోలగానే ఉంటుంది. అసలు మీబోటివాళ్ళను ఎక్కించుకోవటమే మాది బుద్ధి తక్కువ' అంటూ రిక్షా వాడు సనుగుకుంటూ వెళ్ళిపోయాడు.

'మీన్ ఫెలోస్. వెధవ గోల' అంటూ లోపలికి వెళ్ళాడు నారాయణ.

'ఏమిటండీ వాడితో గోల' నిర్మల ఎదురుపడి అడిగింది.

'ఏముంది! మార్కెటునుండి ఇక్కడకు ఆరు అణాలు కావాలంటాడు వెధవ.'

'అదేమిటండీ అలాగంటారు. ఒక్కొక్కసారి అర్ధరూపాయికూడ తీసుకుంటారుగా. ఇంకా నయం ఆరు అణాలే అడిగాడు.'

'అర్ధరూపాయి కాకపోతే రూపాయి ఇస్తావు. నీకేం. నువ్వేమయినా సంపాదించేదానివా.'

'మీరెంతిస్తే నాకెందుకులెండి. నామీద విరుచుకు పడుతున్నారు. ఐనా ఈ విశాఖపట్నంలో మార్కెటు నుండి ఇక్కడకు ఆరు అణాలు లేకపోతే వారెట్లా బ్రతుకుతారండి.'

'బ్రతకపోతే చావమను. నాకేం' అన్నాడు నారా యణ తీవ్రంగా. టైము పదకొండుగంట అవుతుంది. నారాయణ డ్రాయింగ్ రూములో కూర్చుని పేపరు చదువుకొంటున్నాడు. ఇంతలో నౌకరు మీకొరకెవరో వచ్చారని చెప్పాడు. 'సరే' లోపలికి రమ్మన్నాడు.

'నమస్కారం. సార్' అంటూ ఒక యువతి లోనికి వచ్చింది.

'నమస్తే...ఆ కుర్చీమీద కూర్చోండి'

'నేనెవరో మీకు తెలియక పోవచ్చు.'

'ఆ! అదే. మీరెవరోనని ఆలోచిస్తున్నాను.'

'మన టౌను మహారాణి పేటలో 'సరోజినీ మహిళల సంఘం' అను సంఘాన్ని మా మహిళ లందరు కలసి స్థాపించామండి. ఆ సంఘ కార్యదర్శినండి నేను. ఏదో మా సంఘానికి పర్మనెంటు బిల్డింగ్ అంటూ లేదండి. అందుకోసము చందాలు పోగు చేస్తున్నాము. అందరి దగ్గర కాదు సుమండి. ఏదో మీబోటి పెద్దలదగ్గర నే...,'

'నిర్మలా... రెండు కాఫీలు పట్రా.'

'అబ్బే ఇప్పుడేం కాఫీయండి. అయినా ఇప్పుడే త్రాగి వచ్చాను. ఇదిగో చూడండి. చందాల పుస్తక మండి. అందరూ వందలూ - రెండొందలూ, అయిదు వందలూ...'

ఇంతలో నిర్మల కాఫీ తీసుకొచ్చింది.

'నమస్కారం అండి' వచ్చిన యువతి నిర్మలను చూచి అంది.

నిర్మల ప్రతి నమస్కారం చేసింది. 'మీరెవరు' అన్నట్లు చూసింది.

'నేను మహిళా సంఘం సెక్రటరీనండి, మా సంఘా నికి చందాకోసమని వచ్చాను.'

నిర్మలేమీ సమాధాన మీయలేదు.

'కాఫీ తీసుకోండి. చల్లారిపోతుంది' అన్నాడు.

'ఎందుకండీ ఇప్పుడు' అంటూనే కాఫీ కప్పు అందు కుంది.

కాఫీలు అయిన తరువాత నిర్మల కప్పులు తీసుకొని వెళ్లింది.

'ఏమండి. మీ పేర చందా ఎంత రాయమన్నారు.'

'ఏదో ఒక యాభై వ్రాసుకోండి.'

'అబ్బే. యాభైయేనా? చాల తక్కువండి. మీబోటి వారు కనీసము ఐదు వందలయినా....చూడండి వంద రూపాయలకు తక్కువెవ్వరూ లేరు.'

'అందరి సంగతి నాకెందుకు లెండి, సరే డెబ్భయి అయిదు రాసుకోండి.'

'అదేమిటండీ కూరగాయల బేరముమాదిరిగా, సరే! మీ పేర ఒకవంద వ్రాస్తాను' అని ఆ యువతి గబగబా రాసేసి రసీదు నారాయణచేతికందించింది. 'డబ్బు ఇప్పుడిస్తారా...మళ్ళీ రమ్మన్నారా.'

'మళ్ళీ ఎందుకండి. ఇప్పుడే తీసుకెళ్ళండి' అంటూ నారాయణ లోపలికి వెళ్ళి పదిపదులు తీసుకువచ్చి ఇచ్చాడు.

'వస్తాన్ సార్' అంటూ ఆ యువతి ఠీవిగా నడుస్తూ వెళ్ళిపోయింది: నిర్మల లోపలనుండి వచ్చింది,

'చందా ఎంత ఇచ్చారండి.'

'ఏదో ఒక వంద రూపాయలు.'

'వంద రూపాయలే, ఎందుకండి దండగ. డబ్బు ఇలా దుబారా చేస్తే ఎలాగండి. మన తాహతుకు మించి నట్లు ఖర్చు పెట్టుకోవాలి.'

'నిర్మలా...ఆ లిస్టు చూశావూ. అందరూ రెండు వందలూ. ఐదువందలూ...'

'అందరి సంగతి మన కెందుకండి. అందరూ ఏట్లో దిగుతారు, మనమూ దిగుతామా, ప్రొద్దున రిక్షావాడు ఒక్క బేడ అడిగితే ఇవ్వలేదు ఈమెకు కాఫీఇచ్చి, వంద రూపాయలు చెల్లించుకొన్నారు,'

'నిర్మలా! ఇంకా నీకీ ప్రపంచంలో బ్రతకటం తెలీదు. రేపామె ఫలానావారింటికి వెళ్ళితే కాఫీయన్న ఇవ్వలేదు. అని నలుగురితో అంటే మన పరువేమన్నా ఉంటుందా. ఫలాన నారాయణ చందా అందరికన్నా తక్కువఇచ్చాడంటే మన గౌరవమేమన్నా ఉంటుందా. మోడరన్ సివిలిజేషన్ నిర్మలా! మోడరన్ సివిలిజేషన్'

'ఏం. మోడరన్ సివిలిజేషనో. ఎంతో కష్టపడి వచ్చి రిక్షావాడు అడిగితే రెండణాలు ఇవ్వలేదు. వృధాగా కాఫీలతో పహా ఈమెకు వందరూపాయలు సమర్పించారు,'

'అంతేలే! నిర్మలా నీకేం తెలీదు' అంటూ పేపరులో నిమగ్నమయ్యాడు మోడరన్ సివిలైజర్ నారాయణ.

* * *

'నిర్మలా! షాపింగ్‌కు వెళ్దాం వస్తావా, మొన్న నేదో చీర కావాలంటివిగా.'

'కాని పెడతాననే మొగడుంటే వద్దనే పెళ్ళాముంటుందా. కాని ఇవాళ పిక్చరుకు వెళ్దామన్నారుగా.'

'దానికేం వెళదాము. కాని నువ్వే రానంటున్నావు.'

'పైగా ఇదోవాటి మళ్ళీనా, నాకు హిందీరాదు స్వామీ! తెలుగు పిక్చరుకు వెళ్దామంటుంటాను. వెధవ హిందీ పిక్చరు ఎందుకండి. అర్థమవందే ఎందుకండి! అయినానాకు తెలీకడుగుతాను మీకు హిందీ వచ్చుటండీ.'

'నిర్మలా, నీ కెన్నిసార్లు చెప్పాను. మనం ఒక సంఘంలో నివశిస్తున్నాం. మనం దాని ప్రకారం నడచుకోవాలి. ఎవడైనా చూచి పలాననారాయణ హిందీ పిక్చర్సు చూడడంటే నాకెంత అప్రతిష్ట.'

'ఏమిటండి అప్రతిష్ట. తెలిసిన సినిమాకి వెళ్ళితే అప్రతిష్ట. తెలీనిదాని కెళ్ళితే గౌరవం. అందరూ నవ్వితే నవ్వటం. ఏడిస్తే...ఏడవటం...'

'నిర్మలా నా సంగతేకాదు. హిందీ సినిమా చూసే వాళ్ళల్లో హిందీ ఎంతమందికి వచ్చు, ఎంతమందికి అర్థమవుతుంది...కాని అదిఒక అలవాటయిపోయింది...ఈ రోజుల్లో హిందీ సినిమాలకి వెళ్ళనివాడొక అన్ సివిలైజ్‌డు ఫెలో. అందుకే నలుగురితో నారాయణ' మనమూ వెళ్దాము.'

'నే రానుబాబు...నాకు ముళ్ళమీద కూర్చున్నట్లుంది. ఏదో తెలిసినదానికి వెళ్ళితే ఆదోరకంగా ఉంటుంది.

'సరే! సినిమా సంగతి తర్వాత ఆలోచిద్దాము .. ముందు షాపింగుకు బయల్దేరు.'

'అదిగో. ఆరోజ్ కలర్ చీరండి. అవి తియ్యండి' నిర్మలకు సేల్సుమన్ తీసి చూపించాడు.

'ధరెంతండి.'

'యాభై రూపాయలు.'

'యాభై రూపాయలే...ఎందుకండి దండగ. నేత సరిగా లేదు. జరీకూడా ఏదో ఒక మాదిరిగా ఉంది.'

'అవసరం లేకపోతే మానెయ్యండి. ఇక్కడ మరో బేరాలు వుండవు.'

'తెలుసులెండి బేరాలు ఉండేదిలేనిది. ఇది పదిరోజుల క్రిందట ముప్పైరూపాయలకే తెచ్చారు.'

'పదిరోజుల క్రిందట మేము పాతిక రూపాయలకే ఇచ్చామండి, అది పాతసరుకు, దానికీ దీనికీ కలరొక్కటి పోలిక. నేత అదీ అంతా తేడా!' సేల్స్‌మన్ అన్నాడు.

'అవన్నీ ఎందుకండి. ముప్పైరూపాయలకు ఇస్తారా ఇవ్వరా!'

'నిర్మలా! ఏమిటా బేరము. బేరాలు లెవ్వని అతను ముందే చెప్పాడుగా. తీసుకుంటే తీసుకో! లేకపోతే లేదు.' అన్నాడు నారాయణ కోపంగా.

'ఏమిటండీ తీసుకునేది. మొన్న శారదావాళ్ళు ఇదే చీర ముప్పయి రూపాయలకు తెస్తే ఇంతలోనే ఇరవై రూపాయలు ఎక్కువా.'

'మళ్ళీ అదే మొండి బేరము. వాళ్ళది ఇంకో రకమయి వుంటుంది. ఇంతకీ నీకు కావాలా వద్దా' నారాయణ అడిగాడు.

'ఏమండీ! ముప్పై రూపాయలకు ఇస్తారా' నిర్మల సేల్స్‌మన్‌ని అడిగింది.

'మేనేజరును అడిగివస్తానుండండి' అంటూ అతను వెళ్ళాడు.

'ఛ! ఛ. ఆడవాళ్ళతో ఇదే గోల వెధవ బేరము' అంటూ నారాయణ విసుక్కుంటున్నాడు.

'సరే! తీసుకోండి. షావుకారు తీసుకోమన్నాడు.' అని సేల్స్‌మన్ చెప్పాడు.

'సరే'నని నిర్మల ఆ చీర తీసుకుంది.

నిర్మలా! నీ కెన్నిసార్లు చెప్పాను. షాపులో బేర మాడవద్దని.'

'ఇదేమిటండి మీరు మరీను. బేరమాడితే తప్పేముందండి. వాడేం వూరికినే ఇస్తున్నాడా. వాడికి గిడితే ఇస్తాడు లేకపోతే లేదు.

'వాడు మొదట్లోనే చెప్పాడుగా బేరాలు లేవని' నారాయణ.

'బేరాలు లేకపోతే ముప్పై రూపాయలకు ఎట్లా ఇచ్చాడు.

'సంపాదించావ్ మహా ఇరవై రూపాయిలు. ఆ షావుకారు ఏమనుకుంటాడు నువ్వామాదిరిగా బేర మాడితే వీళ్ళకు షాపులో ఎలా మెలగాలో తెలీదు. "అన్ సివిలైజ్‌డ్" అనుకోరూ...'

'అబ్బ మీకామాట ఒకటి దొరికింది. అన్ సివిలైజ్‌డ్. ఏమిటండీ సివిలిజేషన్. షాపులో బేరమాడితే అన్ సివిలిజేషనా.'

'నిర్మలా అట్టే వాగకు. మన అదృష్టవశాత్తూ... మన ఫ్రెండ్స్ ఎవరూ కనబడలేదు. మన పరువు ప్రతిష్టా...'

'ఏమిటండి పరువు ప్రతిష్ట గౌరవం. వీటిని డబ్బు పెట్టి ఎన్నిరోజులు కొనుక్కుంటామండి.'

'నిర్మలా నీకింకా లోకానుభవము తక్కువ. ఈ రోజుల్లో షాపులో బేరమాడితే గౌరవం తక్కువ. వాడినో పిచ్చిక్రిమి క్రింద చూస్తారు.'

'చూస్తారూ. ఎందుకు చూడరు. అదంతా మనచేతుల్లోనే ఉంది.'

'అది సరేకాని సినిమా సంగతేం జేశావు నిర్మలా'

'నే చేసేదేముంది. నేను హిందీ సినిమాకురాను. నాకది అర్థం గాదని చెప్పానుగా.'

'సరే! ఓపని చేద్దాము. ఇంగ్లీషు పిక్చరుకు వెళ్దాము.'

'గుడ్డిలో మెల్ల. హిందీ కంటే ఇంగ్లీషే నయము. దానికే పదండి'

'సరే! ఐదుగంటలకొస్తా రెడీగా వుండు' అని నారాయణ బయటికి వెళ్ళిపోయాడు.

* * *

బయట కారు హారన్ విన్పిస్తుంది. నారాయణ టకటక బూట్లు శబ్దం చేస్తూ నడుస్తూ వచ్చి 'ఏం నిర్మలా! ఇంకా రెడీ కాలేదు అయిదున్నర అయింది.'

'ఇదిగో వస్తున్నానండి. ఫ్లాస్కులో కాఫీ ఉన్నది తీసుకోండి.'

'నే తీసుకొంటాలే. నువ్వు త్వరగా రావాలి.'

'ఇదిగో ఒక్క నిమిషం.'

'టాక్సీ ఎందుకండి ఎంతదూరమని. డబ్బులిట్లా అనవసరంగా. తగలేస్తే ఎలాగండి.'

'నిర్మలా అనవసరపు సంభాషణ కట్టిపెట్టి ముందు టాక్సీఎక్కు.'

నిర్మల మౌనంగా టాక్సీ ఎక్కింది. నారాయణ ఆమె ననుసరించాడు.

రెండు నిమిషాల్లో టాక్సీ హాలులో చేరింది.

'రెండు మైళ్ళుసార్' అన్నాడు డ్రైవర్.

రెండు రూపాయల కాగితమును ఇచ్చాడు నారాయణ. డ్రైవర్ శెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

'అదేమిటండి! వెళ్ళిపోతున్నాడు.' అంది నిర్మల.

'వెళ్ళనీ: ఇంకెందుకు'

'అదిగాదండి. రెండు మైళ్ళకు రూపాయిన్నరేగా. మీరు రెండు రూపాయలు ఇచ్చారుగా. చిల్లరివ్వ లేదుగా.'

'చిల్లరా ఏం ఇవ్వలేదు ...పోనీ...ఒక అర్ధరూపాయేగా.'

'ఎందుకివ్వడు...అడగండి.

'అడగటమా...అంతకన్నా సిగ్గుచేటు ఇంకేమున్నా వుంటుందా...నలుగురిలో మన పరువు పోదూ...'

'మీ పద్ధతి నాకేం నచ్చటం లేదండి...మాట్లాడితే పరువు గౌరవం...డబ్బు అయన దానికి, కాని దానికీ ఇలా తగలెయ్యటము.'

నిర్మలా నారాయణలు సినిమా హాలులోనికి వెళ్ళారు. పిక్చరు షేక్స్పియర్ రోమియో అండ్ జూలియట్ బాగానే వుంది. ఇంటర్వల్ అయింది. నారాయణ రెండు డ్రింకులు తీసుకువచ్చాడు. నారాయణ ప్రక్కనే ఒక ఆంగ్లో ఇండియన్ లేడి కూర్చుని యున్నది. 'టేకిట్ మేడమ్' అంటూ డ్రింక్ అమెకందించాడు నారాయణ. నిర్మల తెల్లబోయి చూస్తుంది. ఇదికూడా 'మోడరన్ సివిలిజేషన్' కాబోలు అనుకుంది. నారాయణ మరో డ్రింకు ఆర్డరిచ్చాడు.

పిక్చరయిపోయింది. నారాయణ 'కాఫీ త్రాగుదాము' రమ్మని నిర్మలతోసహా దగ్గరలోనున్న కాఫీ హోటలుకు వెళ్ళాడు.

నిర్మలా నారాయణ చెరో కప్పు కాఫీ త్రాగారు.

సర్వరు ప్లేటులో బిల్లు పెట్టాడు. ఆ ప్లేటులోనే 2 రూపాయల కాగితం ఉంచాడు నారాయణ. సర్వరు వెళ్ళి బిల్లు తీసుకుని చిల్లరతోసహా మరల ప్లేటు నారాయణ ముందుంచాడు. నారాయణ చిల్లరంతా తీసుకుని ఒక పావులా బిళ్ళ అందులో మిగిల్చాడు. సర్వర్ పావులా బిళ్ళ తీసుకుని శెల్యూట్ చేసి వెళ్ళిపొయ్యాడు.

'ఆ పావులా ఎవరికండి' నిర్మల అడిగింది.

'సర్వరుకు'

'వాడికెందుకు'

'ఎందుకేమిటి. ఇది ఈ హోటల్ ఆచారం. అలా సర్వరుకు డబ్బులు ఆ ప్లేటులో మిగల్చనివారు అన్ సివిలైజ్డ్ పీపులు అన్నమాట...'

'అదిగో...మీరామాట మాన్తారా...మానరా...ఏమిటండీ సివిలిజేషన్...డబ్బులు తగలెయ్యటము.'

'ఇక్కడ నీతో గోలెందుకు. రా వెళ్దాము. నాకు ఆకలిగా ఉంది'

నారాయణ నిర్మలా ఇంటికి వచ్చారు.

'అమ్మా! ధర్మం తల్లీ, నిన్నటినుండి అన్నము లేదమ్మా. ఒక్కముద్ద అన్నం పెట్టించండమ్మా.'

'ఛీరా! పో వేళకాని వేళ. ఎప్పుడూ దానాలూ, ధర్మాలూ' విసుక్కున్నాడు నారాయణ.

'బాబూ! గతిలేనివాడిని స్వామీ! ధర్మప్రభువులు పట్టెడన్నము పెట్టించండి దొరా!'

'నీకాదంటరా చెప్పేది! దున్నపోతులాగున్నావు. పనిచేసుకుని బ్రతకలేవు.'

'అవిటివాడిని స్వామీ ఈ కాలు పడిపోయింది.'

'ఇంకా వాగుతూనే ఉన్నావు. నీకేం చెవుడా, నీక్కాదూ చెప్పేది'

'మీధర్మాన చెవుడింకా రాలేదండి......'

'ఇదిగోరా అబ్బీ! జోలి పట్టు' అంటూ నిర్మల ప్లేటులో అన్నము తీసుకొచ్చి బిచ్చగాడికి వేసింది.

'నిర్మలా ఏమిటది. ఇలా ధర్మాలుచేస్తే ఇక బ్రతికినట్లే. నీలాటివాళ్ళు ఇంకా వుండబట్టే భారతదేశమిలా అధోగతిపాలులో ఉన్నది'

'ఏం ఫరవాలేదులెండి. వాడికి ఒక్కముద్ద పెట్టినంత మాత్రాన మనకేమీ కొరవలేదు. అయినా మీరు సినిమాలో ఆంగ్లోఇండియన్ లేడీకి ఇచ్చిన డ్రింకులో నాల్గోవంతు లేదు'

'దానికీ దీనికి పోటీ ఏమిటి'

'ఏం! మీది పెద్దమనిషి తరహా. అడగకుండానే ధర్మం చేసారు. వీడు కూటికి గతిలేక వచ్చాడు. ఏది న్యాయమో ఆలోచించండి'

'ఇంకా నీకీ సివిలైజ్డ్ కంట్రీలో బ్రతకటము తెలీదు నిర్మలా...పిల్లికీ, ఎలుక్కీ ఒకటే మంత్రమంటావు.

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

'నాకేం సివిలిజేషన్ తెలీదు...అన్ సివిలైజ్డ్ బ్రూట్‌ని... తెలిసిందా...సివిలిజేషన్ అంటూ డబ్బు ప్రతిదానికీ తగలెయ్యటము నాకు తెలీదు' అని నిర్మల విసురుగా వెళ్ళిపోయింది

.........................

'ఏంటి నిర్మలా. పనిమనిషి అడుగుతూంది' అంటూ నారాయణ వచ్చాడు.

'ఏం లేదండీ. దాని జీతము ఇంకో రెండు రూపాయలు ఎక్కువ చేయమంటుంది'

'ఇప్పుడేమొచ్చింది'

'ఈ జీతము దానికి చాలదట, అన్నీ ధరలు పెరిగినాయట'

'అన్నిటికీ ధరలు పెరిగాయి. కాని మన జీతాలు పెరగలేదుగా...చేస్తే చెయ్యమను. లేకపోతే లేదు'

'ఇంకొక్క రెండు రూపాయలు పెంచమంటుంది'

'రెండు రూపాయలే శుద్ధ దండుగ. ఇప్పటికే ఎక్కువ.'

'మీకాలాగునే కన్పిస్తుందిలెండి. ఎంతపని చేస్తుంది చెప్పండి. నాకు రెండు రూపాయలు ఇద్దామనే ఉంది' నిర్మల అంది.

'నీకేం నువ్వు ఇస్తావు. సంపాదించేది నువ్వుకాదుగా'

'ఏమిటండీ ఎప్పుడూ సంపాదన...సంపాదన... అంటారు. లోకంలో మీరేనా సంపాదించేది...అయినా పనిచేసేవాళ్ళకు జీతాలు పెంచకపోతే ఇంకెవరికండి... మీరు సివిలిజేషన్ అంటూ ఖర్చుచేసేదానిలో పదోవంతు లేదు, వాళ్ళు కష్టపడి పనిచేసి ఇంకో రూపాయి ఇమ్మంటున్నారు. ఇంతలో ఏంపోయింది.'

'సరే నీ ఇష్టము. నేచేసే ఖర్చులన్నీ దండగ. నీవు చేసేవన్నీ లాభము' అంటూ నారాయణ వెళ్ళిపోయాడు.

'అబ్బ ఏమి లోకము! కష్టపడి పనిచేసి డబ్బు అడిగితే కోపము..చిరాకు...ఇవ్వటము శుద్ధదండగ. అంతకు పదిరెట్లు డబ్బు సివిలిజేషన్...సివిలిజేషన్ అంటూ ఖర్చుపెడతారు. ఎప్పుడు బాగుపడుతుందో ఈ లోకము. సివిలిజేషన్ అంటే డబ్బు ఖర్చుపెట్టటమా...మానవుని విజ్ఞానము ఇంతకుమించి ఒక్కమెట్టుకూడ పైకిపోదా! మానవుడు బాగుపడేదిలేదా' అనుకొంటూ ఒక నిట్టూర్పు విడిచింది నిర్మల.

